క్లుప్తంగా

నేడు అన్నదానం

పీలేరు రూరల్ : అయోధ్య రామ విగ్రహప్రతిష్ట సందర్భంగా సోమవారం పీలేరు పట్టణం నాలుగు రోడ్ల కూడలిలో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న శ్రీ వరసిద్ధి వినాయక కార్పెంటర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కుమార్‌ఆచారి, చంద్రశేఖర్ ఆచారి తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ అయోధ్య రామ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా సోమవారం ఉదయం పట్టణంలో రాములవారి విగ్రహాల ఊరేగింపు, 11 గంటల నుంచి 3 గంటల వరకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

కార్మికుడిపై దాడి

మదనపల్లె సిటీ: మదనపల్లె మండలం సీటీఎం గ్రామానికి చెందిన వెల్డింగ్ కార్మికుడు సుదర్శన్‌రెడ్డిని శనివారం రాత్రి అదే గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు దాడి చేసి గాయపరిచారు. ఔట్‌పోలీసుస్టేషన్ పోలీసు కథనం మేరకు సురేంద్రరెడ్డిని అదే గ్రామానికి చెందిన హుస్సేన్, కాలేషాలు ఇనుపరాడ్‌తో తలపై కొట్టి గాయపరిచారు. దీంతో గాయపడిన సురేంద్రరెడ్డిని కుటుంబ సభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు ఆస్పత్రి అవుట్‌పోస్టు పోలీసులు తాలూకా పోలీసులకు సమాచారం ఇచ్చారు.

చౌకబియ్యం తరలిస్తున్న ఇద్దరు అరెస్టు

మదనపల్లె సిటీ: చౌకబియ్యం అక్రమంగా తరలిస్తున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు స్థానిక వన్‌టౌన్ ఎస్.ఐ హరిహరప్రసాద్ తెలిపారు. పట్టణంలోని చంద్రాకాలనీకి చెందిన రాము(24), రెడ్డిప్రసాద్(21)లు శనివారం రాత్రి ఆటోలో ఎనిమిది బస్తాల చౌకబియ్యాన్ని తరలిస్తుండగా తనిఖీల్లో పట్టుబడ్డారు. ఈ మేరకు ఆటోతో సహా బియ్యాన్ని స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

మదనపల్లె వన్ టౌన్ ఎస్ఐగా బాలకృష్ణ



మదనపల్లె సిటీ: మదనపల్లె వన్‌టౌన్ ఎస్ఐగా బి.బాలకృష్ణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఎస్పీ కృష్ణారావు ఆదేశాల మేరకు ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. 2020 బ్యాచ్‌కు చెందిన బాలకృష్ణ కేవీ పల్లి పోలీసుస్టేషన్‌లో ఎస్.ఐగా పని చేశారు. రాయచోటి సైబర్ సెల్ ఎస్ఐగా పని చేస్తూ ఇక్కడికి బదిలీపై వచ్చారు. శాంతిభద్రతల పరిరక్షణకు తనువంతు కృషి చేస్తానని తెలిపారు.

కేవీపల్లె ఎస్ఐగా రహీముల్లా



కేవీపల్లె : కేవీపల్లె ఎస్ఐగా ఎస్.కె. రహీముల్లా బాధ్యతలు స్వీకరించారు. ఇది వరకు కేవీపల్లె ఎస్ఐగా ఉన్న లోకేష్‌రెడ్డి జిల్లా ఎస్పీ కార్యాలయానికి రిపోర్టు చేశారు. కలికిరి ఎస్ఐగా పని చేస్తున్న ఎస్.కె. రహీముల్లా కేవీపల్లె బదిలీ అయ్యారు. ఆదివారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు, అసాంఘిక కార్యకలాపాల నిర్మూలనకు తనువంతు కృషి చేస్తానని తెలిపారు.

పర్సన్ ఇన్‌చార్జ్‌గా ఏడీ త్యాగరాజు

బి.కొత్తకోట: తంబళ్లపల్లె (ములకలచెరువు) వ్యవసాయ మార్కెట్ కమిటీ పర్సన్ ఇన్‌చార్జ్‌గా మార్కెటింగ్‌శాఖ జిల్లా ఏడీఏ త్యాగరాజును ప్రభుత్వం నియమించిందని మార్కెట్ కార్యదర్శి జగదీష్ తెలిపారు. గతనెల 20వ తేదీకి కమిటీ పాలకవర్గ పదవీకాలం పూర్తయ్యిందని తెలిపారు. పాత కమిటీనే మళ్లీ పాలక మండలిగా జీవో జారీ కాలేదని, కొత్త కమిటీ నియామకం వరకు పర్సన్ ఇన్‌చార్జ్ పాలకవర్గ బాధ్యతలను నిర్వర్తిస్తారని తెలిపారు.

నాటుసారా విక్రేత అరెస్ట్

గుర్రంకొండ: నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని ఆదివారం పోలీసులు అరెస్ట్ చేశారు. మండలంలోని చెర్లోపల్లె పంచాయతీ దద్దాలవారిపల్లెలో గరుడప్ప నాటుసారా విక్రయిస్తున్నాడనే సమాచారం అందుకొన్న పోలీసులు దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకొని అతని వద్ద నుంచి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకొన్నట్లు ఎస్ఐ దిలీప్‌కుమార్ తెలిపారు. కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

లోకాయుక్తాకు ఘనంగా వీడ్కోలు

పెద్దతిప్పసముద్రం: రాష్ట్ర లోకాయుక్త జస్టిస్ పీ.లక్ష్మణరెడ్డి సంక్రాంతి పండుగ విడిది కోసం కుటుంబ సభ్యులతో మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లిలోని స్వగృహానికి విచ్చేశారు. ఆదివారం తిరుగు ప్రయాణంలో ఆయనకు రెవెన్యూ అధికారులు, గ్రామ పంచాయతీ, పోలీసు సిబ్బందితో పాటు ఏఎంసీ మాజీ చైర్మన్ పీ.శ్రీనాథ్‌రెడ్డి ఘనంగా వీడ్కోలు పలికారు.

జూదరుల అరెస్ట్

రామసముద్రం: చెంబకూరు గ్రామ సమీపంలోని మామిడి తోపులో కోడిపందెం నిర్వహిస్తున్న వారిపై ఆదివారం దాడులు నిర్వహించినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. దాడుల్లో ఐదుగురిని అరెస్ట్ చేసి, రెండు కోళ్లను అదుపులోనికి తీసుకుని, రూ. 5270 నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

జూనియర్ కళాశాలకు మహర్దశ



ఆధునీకరించిన కాలేజీ ఆడిటోరియం



నిర్మాణ పనులను పనులను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్

- రూ.88 లక్షలు మంజూరు
- కళాశాలలో చురుగ్గా సాగుతున్న పనులు
- విద్యార్థుల హర్షాతిరేకాలు

నాడు ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ. ఈ పేరు వింటేనే ఘన చరిత్ర కదలాడుతుంది. ఎంతో మందికి విద్యను అందించిన ఘనత ఇది. అంతటి కీర్తి ఉన్న కాలేజీలో గదులు లేక చెట్ల కింద చదువులు, శిథిలావస్థకు చేరుకున్న తరగతి గదులతో విద్యార్థులు ఇబ్బందులు పడేవారు.

నేడు కళ తప్పిన కాలేజీకి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జీవం పోసింది.కాలేజీ దుస్థితిని పరిగణలోకి తీసుకుని నాడు–నేడు ఫేజ్–2 కింద రూ.88 లక్షలు మంజూరు చేసింది. కాలేజీలో ప్రాథమిక సదుపాయాలు కల్పనకు ఆయా నిధులు కేటాయించింది. ప్రస్తుతం పనులు వేగంగా నిర్వహిస్తున్నారు.

మదనపల్లె సిటీ: టీడీపీ ప్రభుత్వ హయాంలో కాలేజీని అభివృద్ధి చేస్తామని ప్రకటనలు చేయడం తప్ప అభివృద్ధి ఆచరణలో చూపలేదు. విద్యార్థులు మాత్రం అగచాట్ల మధ్యలోనే చదువును కొనసాగించారు. ప్రభుత్వ కాలేజీలను నాడు–నేడు రెండో విడత నిధులతో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా మదనపల్లె ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజీ రెండో విడత నాడు–నేడు కింద ఎంపికైంది. దీంతో కళాశాలలో సౌకర్యాలు మెరుగుపడనున్నాయి. నాడు–నేడు కింద రూ.88 లక్షల నిధులు మంజూరయ్యాయి. కాలేజీలో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరంలో అన్ని గ్రూపుల్లో సుమారు 650 మందికిపైగా విద్యార్థినులున్నారు. కాలేజీలో అన్ని తరగతి గదులలో గ్రైనైట్‌తో ఫ్లోరింగ్ వేశారు. మరుగుదొడ్లను ఆధునీకరించారు. నూతనంగా బాత్‌రూములను నూతనంగా నిర్మిస్తున్నారు. నిరంతర నీటి సరఫరా, మరుగుదొడ్లు, రక్షిత తాగునీటి సౌకర్యం, ఫర్నీచర్, గ్రీన్ చాక్‌బోర్డులు, మేజర్, మైనర్ మరమ్మత్తులు, రంగులు, విద్యుదీకరణ, రంగులు, ఫ్యాన్లు, లైట్లు పనులు చేపట్టారు. పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.

వసతుల కల్పనే లక్ష్యం



ప్రభుత్వ జూనియర్ కాలేజీ విద్యార్థులకు అన్ని వసతులు కల్పించాలన్నదే ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఉద్దేశం. ఇందులో భాగంగా కాలేజీకి నాడు–నేడు పనులు ప్రారంభించాం. మొదటి ప్రాధాన్యతగా మరుగుదొడ్లు, ఇతర మౌలిక సదుపాయలకు ప్రధాన్యత ప్రకారం పనులు జరుగుతున్నాయి.త్వరలో పనులు పూర్తవుతాయి.

-బాలకృష్ణమూర్తి, ప్రిన్సిపాల్, ప్రభుత్వ బాలికల జూనియర్ కాలేజ, మదనపల్లె

అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శం

– ఎమ్మెల్యే నవాజ్‌బాషా



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా, బాస్ శివప్రసాద్ తదితరులు

మదనపల్లె : రాజ్యాంగ నిర్మాత, దళిత వర్గాల ఆశాజ్యోతి డాక్టర్.బీఆర్.అంబేడ్కర్ జీవితం అందరికీ ఆదర్శనీయమని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. ఆదివారం మండలంలోని వేంపల్లె ఎస్సీ కాలనీలో భారతీయ అంబేడ్కర్ సేన(బాస్) ఆధ్వర్యంలో సింబల్ ఆఫ్ ఈక్వాలిటీ పేరుతో నిర్మించిన అంబేడ్కర్ విగ్రహాన్ని బాస్ వ్యవస్థాపక అధ్యక్షులు పీటీఎం.శివప్రసాద్, డీఎస్పీ కేశప్పతో కలిసి ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... అంబేడ్కర్ ఓ మతానికి, జాతికి చెందిన వ్యక్తి కాదని, సమాజహితం కోసం పాటుపడిన మహోన్నత వ్యక్తి అన్నారు. బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతిగా రాజ్యాంగాన్ని రూపొందించారన్నారు. అంబేడ్కర్ ఆశయాలకనుగుణంగా, ఆయన స్ఫూర్తితో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో కుల,మత,వర్గాలకు అతీతంగా అందరి సంక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారన్నారు. అణగారిన వర్గాల ఆత్మగౌరవ సూరీడైన అంబేడ్కర్ మహనీయుడి ఆశయాలను, ఆదర్శాన్ని, స్ఫూర్తిని భావితరాలకు అందించాలనే ఉద్దేశంతో ఈనెల 19న దేశానికే తలమానికంగా విజయవాడలోని స్వరాజ్‌మైదానంలో 206 అడుగుల కాంస్య విగ్రహాన్ని సామాజిక న్యాయ మహాశిల్పం పేరుతో ఏర్పాటు చేయడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమన్నారు. ఎప్పటికీ మరణం లేని మహనీయుడెవరైనా ఉంటే అంబేడ్కర్ అని, ఆయన భావజాలంతో సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. ఆయన నాయకత్వంలో ఎమ్మెల్యేగా పనిచేయడం తన అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. వైఎస్సార్ సీపీ 56 నెలల పాలనలో సామాజిక, ఆర్థిక, రాజకీయ చైతన్యం దిశగా గ్రామగ్రామాన మార్పు తీసుకువచ్చిందన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేణుక, నీరుగట్టిరమణ, చాట్లబయన్న, మాజీ జెడ్పీటీసీ రంగప్ప, కొండామర్రిపల్లె ఇస్మాయిల్, బండిశివయ్య, బావాజీ తదితరులు పాల్గొన్నారు.

నవరత్నాలతో పేదల తలరాతలు మారాయి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: నవరత్నాలతో పేదల తలరాతలు మారాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డితోనే రాష్ట్ర ప్రగతి, అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. ఆదివారం పట్టణానికి చెందిన విజయ్ కుమార్ ఆచారి, శ్రీదేవి, చైతన్యసాయిరామ్, కాంచనమాల, రామచంద్రాచారి, మణిబాబు ఆచారి, గౌరమ్మ, చంద్ర, భాగ్యమ్మ, లిఖిత తదితరులు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. వీరికి ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి వైఎస్సార్‌సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయినప్పటి నుంచి నవరత్నాల ద్వారా ప్రజలకు నేరుగా పథకాలను వారి ఖాతాల్లో జమ చేస్తూ.. ఆర్థికంగా బలోపేతం చేస్తున్నారన్నారు. కులమతాలు, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో కువైట్ శంకచారి పాల్గొన్నారు.

యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి



విజేత జట్టుకు బహుమతిని అందిస్తున్న ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి

వాల్మీకిపురం: యువత చదువుతోపాటు క్రీడల్లో రాణించాలి ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి అన్నారు. మండలంలోని గండబోయనపల్లిలో గత పది రోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. గండబోయనపల్లి క్రికెట్ టోర్నమెంట్ విజేతగా కలికిరికి చెందిన సాయిక్రికెట్ టీం విజేతగా నిలవగా రన్నర్స్‌గా గండబోయనపల్లి క్రికెట్ టీం నిలిచింది. ఈ ముగింపు సమావేశానికి హాజరైన ఎండీసీ డైరెక్టర్ హరీష్ రెడ్డి క్రికెట్ విజేత జట్టుకు రూ.25వేలు నగదుతోపాటు బహుమతిని అందించారు. అలాగే రన్నర్స్‌గా నిలిచిన గండబోయనపల్లి జట్టుకు రూ.15వేలు నగదు, బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, సాయి, శ్రావణ్, అక్బర్, మౌనేష్, ఉదయ్, జావేద్, మౌలాలి, నవాజ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు

పెద్దతిప్పసముద్రం: మండలంలోని తుమ్మరకుంట పంచాయతీ బండమీదపల్లిలో వాల్మీకుల సంఘం ఆధ్వర్యంలో కబడ్డీ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంటులో 30 టీంలు పాల్గొనగా బండమీదపల్లికి చెందిన విజేత టీంకు పులికల్లుకు చెందిన తలారీ మంజునాథ్ రూ.5,116లు, రెండవ బహుమతిగా ఎగువపల్లికి చెందిన రామచంద్ర రూ.2,116లు, మూడవ బహుమతిని తుమ్మరకుంటకు చెందిన యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ ద్వారా రూ.1,116 నగదును ఆదివారం అందజేశారు. ఆర్గనైజర్స్, ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్థులు శ్రీనివాసులు, లక్ష్మినర్సు, రమణ,నాగన్న, గణేష్, రాజశేఖర్, నరేష్, శీనూ, నరసింహ పాల్గొన్నారు.

ఎస్ఈబీ సీఐగా రామమోహన్



ములకలచెరువు: ములకలచెరువు సర్కిల్ ఎస్ఈబీ సీఐగా జి. రామమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదివారం సర్కిల్ కార్యాలయానికి ఉత్తర్వులు అందాయి. ఇక్కడ విధులు నిర్వహిస్తున్న సీఐ మల్లికా కర్నూలు జిల్లాకు బదిలీ అయ్యారు. జి. రామమోహన్ సత్యసాయి జిల్లా కదిరి నుంచి ఇక్కడికి బదిలీ అయ్యారు. ఈయన గతంలో ఎక్సైజ్ సీఐగా ఇక్కడ విధులు నిర్వహించారు.

రెడ్డెమ్మకొండపై భక్తుల రద్దీ

గుర్రంకొండ: చెర్లోపల్లె గ్రామంలో వెలసిన రెడ్డెమ్మతల్లి ఆలయం ఆదివారం అశేష భక్త జనసందోహంతో పోటెత్తింది. ఈసందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఉదయాన్నే అమ్మవారికి నైవేద్యం సమర్పించి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. సుదూర ప్రాంతాల నుంచి సంతాన ప్రాప్తి కోసం వచ్చిన మహిళలు అమ్మవారి ఎదుట వరపడ్డారు. సంతానం కలిగిన భక్తులు అమ్మవారికి చీరె,సారెలతో మొక్కులు చెల్లించుకొన్నారు.

ఆలయ పునఃనిర్మాణానికి నిధులు మంజూరు



ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

తంబళ్లపల్లె: మండలంలోని కన్నెమడుగు పంచాయతీ చిన్నమాచిరెడ్డిగారిపల్లెలో వెలసిన ఆవుదేవర దేవస్థానం పునఃనిర్మాణానికి రూ.1.07 కోట్లు మంజూరైనట్లు సర్పంచు శ్యామలమ్మ, మల్లయ్యకొండ చైర్మన్ మల్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు మహేష్, దేవదాయశాఖ ఉద్యోగులు అంకన్న, కొండకిట్ట తెలిపారు. ఆదివారం కన్నెమడుగు రెడ్డివారిదాయాదులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద ఆలయ పునఃనిర్మాణం అంశంపై చర్చా సమావేశం జరిగింది. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డిల కృషితో నిధులు మంజూరు కావడంపై వారికి కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల భాగస్వామ్యంగా రూ.21.05 లక్షలు చెల్లించేందుకు ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. కార్యక్రమంలో రవిశంకర్‌రెడ్డి, మల్లికార్జునరెడ్డి, కుమార్‌రెడ్డి, రఘురామిరెడ్డి, వెంకటశివారెడ్డి, చిన్నరెడ్డి, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిబ్రవరి 3న బహుజన రాజ్యాధికార సదస్సు

మదనపల్లె : బహుజన సమాజ్ పార్టీ(బీఎస్పీ) ఆధ్వర్యంలో ఫిబ్రవరి 3న బహుజన రాజ్యాధికార సదస్సు నిర్వహిస్తున్నట్లు బీఎస్పీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బందెలగౌతమ్‌కుమార్ వెల్లడించారు. ఆదివారం మదనపల్లె నియోజకవర్గానికి సంబంధించి బీఎస్పీ ముఖ్యనాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బందెలగౌతమ్‌కుమార్ మాట్లాడుతూ...పట్టణంలోని సీఎస్ఐ జేసీఎం కమ్యూనిటీ హాల్ నందు ఫిబ్రవరి మూడోతేదీన ఉదయం 10 గంటలకు జరిగే సమావేశానికి బీఎస్పీ రాజ్యసభ సభ్యులు రాంజీగౌతమ్, రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి, రాష్ట్ర నాయకులు హాజరవుతారన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బహుజన రాజ్యాధికార సదస్సు నిర్వహిస్తున్న నేపథ్యంలో... మదనపల్లె నాయకులు సమావేశాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేయాలన్నారు.

నిసార్‌అహ్మద్‌ను కలిసిన వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు



నిసార్‌అహ్మద్‌ను అభినందిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్లు

మదనపల్లె : నియోజకవర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త నిసార్‌అహ్మద్‌ను ఆదివారం మున్సిపల్ కౌన్సిలర్లు మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. నిసార్ అహ్మద్‌ను కలిసినవారిలో... మున్సిపల్ వైస్ చైర్మన్‌లు జింకాచలపతి, నూర్‌ఆజం, కౌన్సిలర్లు ప్రసాద్‌బాబు, బి.ఏ.ఖాజా, పాల్‌చంద్రశేఖర్, ఈశ్వర్‌నాయక్, రాజేష్, వైఎస్సార్ సీపీ నాయకులు గుండ్లూరురఫీ, బాలగంగాధరరెడ్డి, పసుపురవి తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా నిసార్‌అహ్మద్ వారితో మాట్లాడుతూ... వైఎస్సార్ సీపీ బలోపేతానికి, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకు సహకరించాల్సిందిగా కోరారు. 2024లో మళ్లీ జగనన్నను ముఖ్యమంత్రి చేసుకోవడమే లక్ష్యంగా అందరం కలిసికట్టుగా పనిచేద్దామని పిలుపునిచ్చారు.

ఓంశక్తి మాలధారణ భక్తుల ర్యాలీ

వాల్మీకిపురం: అయోధ్య శ్రీరాముడి ఆలయ ప్రారంభోత్సవాన్ని కులమతాలకు అతీతంగా అందరం పండుగలా జరుపుకుందామని స్థానిక శ్రీ నల్లవీరగంగాభవాని అమ్మవారి ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మెన్ మొర్రంరెడ్డి రాంకుమార్ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీ నల్లవీర గంగాభవాని అమ్మవారి ఆలయం వద్ద ఓంశక్తి మాలధారణ ధరించిన భక్తులు జైశ్రీరాం జెండాలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఆనంద శెట్టి, రమేష్, ఆనంద, భక్తులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం

బి.కొత్తకోట: బీజేపీ పాలనలో కేంద్రప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అయ్యాయని సీపీఐ జిల్లా కార్యదర్శి నరసింహులు అన్నారు. ఆదివారం లెనిన్ శత వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రామికవర్గ పక్షపాతిగా అణగారిన వర్గాల అభ్యున్నతికి లెనిన్ కృషి చేశారన్నారు.

కులగణన సర్వే తనిఖీ

తంబళ్లపల్లె: మండలంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న కులగణన సర్వే కార్యక్రమాన్ని ఆదివారం ఎంపీడీఓ సురేంద్రనాథ్ తనిఖీ చేశారు. కన్నెమడుగు, ఎద్దులవారిపల్లె పంచాయితీల్లో పర్యటించారు. సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి సర్వేయాప్‌లో పూర్తి సమాచారాన్ని పొందుపరచాలన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



చౌడసముద్రం ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు

ములకలచెరువు : ములకలచెరువు మండలం చౌడసంద్రం ఉన్నత పాఠశాలలో 1976 – 77 సంవత్సరంలో పదవ తరగతి వరకు చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో సమావేశమయ్యారు. 47 సంవత్సరాల తరువాత కలుసుకున్న వీరి ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. సుదీర్ఘ ప్రాంతాల నుంచి చిన్ననాటి స్నేహితులను కలుసుకునేందుకు ఉదయం 10 గంటలకే పాఠశాలకు చేరుకున్నారు. నాటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకొని సంతోషాన్ని పంచుకున్నారు. పాఠశాలలో విద్యాబుద్ధులు నేర్పించిన ఉపాధ్యాయుల గురించి నెమరు వేసుకున్నారు. మధ్యాహ్నం అందరూ కలిసి పాఠశాలలోనే కలసి భోజనం చేశారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు గుర్రప్ప నాయుడు, కృష్ణప్ప,మల్లప్ప,వెంకటరెడ్డి, నాగరాజు, వేణుగోపాల్,అబ్దుల్, రసూల్, ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.